క్లుప్తంగా

రైతులు అప్రమత్తం



ట్రైరుబండ్లపై ఉన్న వరిచేను తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచిన దృశ్యం

బాడంగి: ఫెంగల్ తుపాను కారణంగా రైతులు అప్రమత్తమయ్యారు. పంటపొలాల్లోని వరి చేను పడకుండా, ఇప్పటికే కోసిన చేను తడిసి పోకుండా, నూర్పిడి చేసిన ధాన్యం పాడవ్వకుండా కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల కోసిన చేను వర్షానికి తడిసిపోకుండా కుప్పలుగా చేను వేసి, వాటిపై టార్పాలిన్లు కప్పివేయగా, మరికొన్ని చోట్ల నూర్పిడి చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయానికి రాజాం ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త పేర్ల భీమారావు, సునీత దంపతులు రూ.40 వేల విరాళం శనివారం అందజేశారు. స్వామి వారి పీఠానికి ఇత్తడి తాపం వేయించేందుకు గాను ఈ మొత్తాన్ని దాతలు అందించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

క్రీడాదుస్తుల అందజేత

వంగర: మండలంలోని అరసాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు క్రీడాకారులకు శనివారం క్రీడాదుస్తులు అందజేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి లావేటి రాంబాబు వాటిని వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఖండాపు జగదీశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ అన్నంనాయుడు, వైస్ ఎంపీపీ సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీ పరిధి, బొడ్డవలస గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. రూ.10 లక్షల వ్యయంతో 250 మీటర్ల పొడవునా ఈ నిర్మాణం చేస్తున్నట్లు బుడుమూరు పట్టాభి తెలిపారు.

సకాలంలో సేవలందించాలి

రాజాం: సకాలంలో ప్రజలకు సేవలందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని శ్యాంపురం గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. అలాగే సచివాలయంలో డేటా ఎంట్రీ ఎస్‌పీసీఎల్, హౌస్‌హోల్డ్ జియో సర్వే తదితర అంశాలపై సమీక్షించారు.

గురజాడకు ఘనంగా నివాళులు



గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మహాకవి గురజాడ అప్పారావు 109వ వర్ధంతి శనివారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పాఠకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు. విజయనగరం జిల్లా ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహోన్నతమైన వ్యక్తి గురజాడ అని, అటువంటి మహనీయుల అడుగుజాడల్లో నడవాలని కోరారు.

గుర్తింపుకార్డుల పంపిణీ

రేగిడి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని మినిమమ్ టైమ్ స్కేల్ ఉపాధ్యాయులకుగుర్తింపుకార్డులు శనివారం పంపిణీ చేశారు. మొత్తం 14 మందికి ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో గజేంద్రనాయుడు, ఎస్.లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

నాగావళి నది నీటి చోరీపై ఫిర్యాదు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న నాగావళి నది నుంచి నీటిని అక్రమంగా స్థానిక ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం తరలిస్తోందని సర్పంచ్ బుడుమూరు పట్టాభి, అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో విజయవాడ ఇరిగేషన్ చీఫ్‌తో పాటు జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని వారు శనివారం తెలిపారు. 2002లో జారీ చేసిన జీవో నంబరు 152 తర్వాత 2017లో పునరుద్ధరించిన జీవో నంబరు 35 ప్రకారం ఇచ్చిన ఆదేశాలను ఇక్కడి యాజమాన్యం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. అప్పట్లో ఒక్క చక్కెర కర్మాగారానికి మాత్రమే నీటి వినియోగానికి అనుమతి ఉండగా, ఇప్పుడు కొత్తగా నిర్మించిన డిస్టలరీ ప్లాంట్‌కు కూడా నీటిని ఎవరికీ తెలియకుండా తరలిస్తున్నారన్నారు. సీఎం సెక్రటరీ కార్యాలయానికి, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని, అధికారులు స్పందించి, అక్రమ నీటి తరలింపును అడ్డుకోవాలని కోరారు.

భవితకు భరోసా నిల్!

- భవిత కేంద్రాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- వేధిస్తోన్న ఫిజియోథెరపీ వైద్యుల కొరత
- నాలుగు మండలాలకు ఒకేఒక్క డాక్టర్ సేవలు
- కనిపించని ప్రత్యేక శిబిరాల నిర్వహణ
- అందని యంత్ర పరికరాల సాయం
- 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



రామభద్రపురం భవిత కేంద్రం

రామభద్రపురం: ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించి, వారికి మేమున్నామనే భరోసా కల్పించేందుకు భవిత కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం ఆయా కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోంది. శారీరకంగా, మానసికంగా అవస్థలు పడుతున్న ఎంతోమంది చిన్నారులు ఉపకరణాలు, శిబిరాల సేవల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మరీ ముఖ్యంగా ఫిజియోథెరపీ వైద్యుల కొరత కేంద్రాలను తీవ్రంగా వేధిస్తోంది. ఉన్నవారు.. నాలుగు మండలాలకు ఒకరు చొప్పున సేవలందిస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాల్లో చేపట్టాల్సిన నెలవారీ కార్యక్రమాలు, యాక్షన్ ప్లాన్ సరిగా అమలుకాకపోవడంతో ఆశించిన ఫలితాల్లేవన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పాడైన పరికరాలతో సేవలు..

బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు భవిత కేంద్రాలు ఉండగా, వాటిలో ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలు సుమారు 80 మంది ఉన్నారు. వారిలో ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల లోపు చదువుకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి, భవిత కేంద్రంలోనే వారికి విద్యనందిస్తున్నారు. అలాగే మానసిక వైకల్యం, వినికిడి లోపం, ఆటిజం, దృష్టి లోపంతో బాధపడే వారికి కేంద్రంలోనే ఫిజియోథెరపీ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే నాలుగు మండలాలకు ఒక్కరే ఫిజియోథెరపీ వైద్యుడు ఉండడంతో వారానికి ఒకరోజు మాత్రమే వచ్చి ఫిజియోథెరపీ అందించాల్సిన పరిస్థితి. దీంతో కేంద్రాల్లోని పిల్లలకు సక్రమంగా ఫిజియోథెరపీ సేవలందడం లేదు. పదేళ్ల క్రితం అందజేసిన పరికరాలే ఇప్పుడు బాగా పాడవ్వడంతో వాటితోనే సేవలందిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ఐఈఆర్‌టీలుగా పనిచేస్తున్న వారే పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నైపుణ్యాలతో పాటు నడవడికలను నేర్పిస్తున్నారు. అంతేకాకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు అనుసరించాల్సిన ప్రత్యేక శ్రద్ధపై కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

తప్పని ఎదురుచూపులు..

ప్రత్యేకావసరాల పిల్లలకు భవిత కేంద్రంలో ఉచితంగా ఉపకరణాలు అందించాలి. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, దివ్యాంగుల అవసరాన్ని గుర్తించి, ఎవరికి ఏ పరికరం అవసరమో అందించాలి. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, వాటిల్లో గుర్తించిన ప్రత్యేకావసరాల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందించే వారు. ప్రతీ ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఏప్రిల్ 16వ తేదీన రామభద్రపురం మండల కేంద్రంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి, అందులో రామభద్రపురం, బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల నుంచి 18 ఏళ్ల వయసు లోపు వారిని 150 మందిగా గుర్తించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గతంలో గుర్తించిన వారికి ఉపకరణాలు, ఫిజియోథెరపీ సేవలు అందించాల్సి ఉన్నా వారిని ప్రస్తుత చంద్రబాబు సర్కారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, తక్షణమే ఉపకరణాలు అందజేయాలని బాధిత బాలల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఉపకరణాల పంపిణీకి దివ్యాంగ చిన్నారులకు లోప నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

నివేదిక పంపించాం..



భవిత కేంద్రంలోని ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నాం. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో వివిధ లోపాలతో బాధపడుతున్న వారికి ఉపకరణాలు అందించకపోవడం వాస్తవమే. వారికి అందజేయాల్సిన ఉపకరణాల కోసం ఆలెమ్కో కాన్పూరు వారికి నివేదిక పంపించాం. అవి వచ్చిన వెంటనే అందిస్తాం.

–ఎ.తిరుమలప్రసాద్, ఎంఈవో, రామభద్రపురం

రూ.120 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



తెర్లాం: సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు చదివి వినిపిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉమాలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులంతా పాల్గొని, 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.120 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌ను వారంతా ఆమోదించారు. అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.132 కోట్ల అంచనా బడ్జెట్‌కు కూడా సభ్యులు ఆమోదం తెలిపారు. ఎంపీపీ ఉమాలక్ష్మి మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్ల రాబడులకు గాను రూ.119 కోట్లు ఖర్చు చేయగా, రూ.95.82 లక్షలు అంత్య నిల్వగా ఉందని, రాబడుల్లో అన్నిరకాల పెన్షన్లు, ఉద్యోగుల జీతభత్యాలు, పీడబ్ల్యూడీ, ఉపాధి పనులు, మిగిలిన అన్ని పద్దులు కలిపి ఉంటాయని పేర్కొన్నారు. మండల పరిషత్ సాధారణ నిధులకు సంబంధించి, 2024–25 సవరణ బడ్జెట్‌లో రూ.15.27 లక్షలు, 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.16.50 లక్షలు అంచనా బడ్జెట్ తయారు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి, ఎంపీడీవో రేగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

2/3 వంతు సభ్యుల ఆమోదం..



బాడంగి: బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం శనివారం జరగ్గా, 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతిపాదించిన రూ.1.5 కోట్ల అంచనా బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే 2024–25 సవరణ బడ్జెట్ కింద ప్రారంభపు నిల్వ రూ.38,52,656 కాగా 81,56,30,000 రాబడులుగా 81,02,320,000 ఖర్చుగా 92,50,656 మిగులుగా సవరణ చేసి ప్రతిపాదించారు. దీనికి సమావేశంలోని 2/3 వంతు సభ్యులు ఆమోదం తెలిపినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పి.రామారావు, వైస్ ఎంపీపీ భాస్కరరావు, ఏవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎస్సీ కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దారు హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హేమంత్‌కుమార్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా ఆ గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం పర్యటించిన ఆయన.. అక్కడి ప్రజలను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ వీధి మధ్యలో పశువులు కట్టడాన్ని వారు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, వీధి మధ్యలో పశువులు కట్టడం ద్వారా వ్యాధులు సోకే అవకాశం ఉందని, నివాసాలకు దూరంగా పశువులను కట్టుకోవాలని సూచించారు. ఎస్సీ కాలనీవాసులు చెప్పిన ప్రతీ సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.కృష్ణమూర్తి, నందిగాం ఎంపీటీసీ ప్రతినిధి అల్లు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వారోత్సవాలు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీచైతన్య ప్రాథమిక పాఠశాలలో సామాజిక వారోత్సవాలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఈవో–2 గొట్టాపు వాసును సత్కరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్రరావు

రేగిడి: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉంగరాడ గ్రామంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులు ఎక్కువగా ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి, గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యానికి అలవాటు పడి తమ జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు. గంజాయి విక్రయాలు జరిగినా, మద్యం బెల్టుషాపులు నిర్వహించినా సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వితరణ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో రెండు నిరుపేద కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు శనివారం అందించారు. ప్రతి నెలా మాదిరిగానే గ్రామంలో కుటుంబ పెద్దను కోల్పోయిన పెదపూడి ఇందుమతి, వడ్డి రాజుకు వీటిని వితరణ చేశామని సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, బెజ్జిపురపు కృష్ణమూర్తి, మక్క శ్రీనివాసరావులు తెలిపారు. తమ సేవలు విస్తృతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

వసతిగృహం సందర్శన



జెడ్పీ స్కూల్‌లో వివరాలు సేకరిస్తున్న జడ్జి విజయరాజ్‌కుమార్

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం బీసీ బాలుర వసతిగృహాన్ని పాలకొండ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ శనివారం సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. బాగా చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. ఆయన వెంట న్యాయవాది ఎం.వెంకటేశ్వరరావు, హెచ్‌డబ్ల్యూవో సత్తిబాబు తదితరులు ఉన్నారు.

ఆక్రమణలపై స్పందించరేం..?

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ రమాదేవి ప్రశ్న



సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలో జరుగుతున్న ఆక్రమణలపై స్పందించరేమి అని మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి అధికారులను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ల ఆక్రమణ కారణంగా తయారైన ఇరుకైన రోడ్లలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఇదే విషయాన్ని పలుమార్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. బజారు రోడ్డు పూర్తిగా ఆక్రమణకు గురైందని, అలాగే పట్టణంలోని పలుచోట్ల రోడ్లపై దుకాణాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు మాట్లాడుతూ పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని ఆదేశించారు. వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారులలో విద్యుత్ స్తంభాలు, బల్బులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ సమస్య పరిష్కారానికి చైర్మన్ హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలు, కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన అభివృద్ధి పనులను సభ్యులు ఆమోదించారు. ఆ తర్వాత 15వ ఆర్థికసంఘం నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులపై చర్చ జరిగింది. అంతకుముందు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కావాల్సిన నిధులను సమకూర్చుకుంటున్న వివరాలను వెల్లడించారు.

ప్రజాప్రతినిధులకు తెలియకుండా నియామకాలు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది నియామకాలపై సభ్యుల మండిపాటు

తెర్లాం: కనీస విద్యార్హత చూడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందిని ఏ విధంగా నియమించారని, కనీసం గ్రామంలోని ప్రజాప్రతినిధులకు కూడా వారి నియామకాలు గూర్చి తెలియనివ్వకపోవడంలో ఆంతర్యమేంటని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సంబంధిత అధికారులను నిలదీశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్షలో ఏవో సునీల్‌కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయమై మాట్లాడుతుండగా కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు, ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు, సుందరాడ సర్పంచ్ అద్దంకి దిలీప్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ల నియామకం ఏ పద్ధతిన చేపట్టారని ప్రశ్నించారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న వారినే నియమించిందని గుర్తు చేశారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆ నియామకాలు జరిగాయని, తమ ప్రమేయం లేదని ఏవో సమాధానమిచ్చారు. ఈ మేరకు సీఎస్‌డీటీ స్వర్ణలతను ఈ నియామకాలపై ఎంపీపీ ప్రశ్నించగా, డీఎం కార్యాలయంలో నాలుగు ఏజెన్సీల ద్వారా వీటి నియామకాలు చేపట్టారని, మిగిలిన విషయాలు తమకు తెలియవని ఆమె తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నియమించిన సిబ్బంది కేంద్రాలకు రావడం లేదని, వీఏఏ ఒక్కరే అన్ని పనులు చేస్తున్నారని సుందరాడ సర్పంచ్ దిలీప్‌కుమార్ అన్నారు. వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది ఇప్పటికైనా ఆయా గ్రామాల్లోని సర్పంచ్, ఎంపీటీసీలను కలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి..

విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో మండలానికి కొత్తగా ఏఈ నియామకం జరిగినా ఎంపీపీని గానీ, ఎంపీడీవోను గానీ ఇంతవరకు కలవకపోవడమేంటని ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో రాంబాబులు నిలదీశారు. గత సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఇంటిపై ఉన్న విద్యుత్ వైర్లు తొలగించేందుకు రూ.10 లక్షలు జెడ్పీ నిధులు ఇస్తామని తెలిపారని, ఇంతవరకు ఎన్ని గ్రామాల్లో అటువంటి వైర్లు గుర్తించారు, ఎన్ని ప్రతిపాదనలు తయారు చేశారని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ప్రశ్నించారు.



సమావేశంలో సీఎస్‌డీటీని ప్రశ్నిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

మండలంలో అనేక గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సభ్యులు కోరారు. ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించగా, గ్రామాల్లో నిర్మిస్తున్న గోశాలలకు గ్రామ పంచాయతీల తీర్మానం అవసరం ఉందా, లేదా అని పలు గ్రామాల సర్పంచ్‌లు అడిగారు. దీనిపై ఏపీవో సుశీల సమాధానమిస్తూ మండలానికి మొదటి విడతగా 58 గోశాలలు మంజూరయ్యాయని, పంచాయతీ తీర్మానాలు ఉన్న వాటినే నిర్మిస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్ష నిర్వహించగా, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కోరారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులంతా కృషి చేయాలని ఎంపీపీ ఉమాలక్ష్మి కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతి సాధించాలి

రాజాం సిటీ: ఇంజినీరింగ్ రంగంలో అధ్యాపకులు ఎప్పటికప్పుడు సాంకేతిక పురోగతి సాధించాలని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండు వారాల పాటు నిర్వహించిన 'కణజాలం మరియు అవయవాల బయో ప్రింటింగ్–యాన్ ఎవల్యూషన్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెటీరియల్స్' ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన.. విద్యారంగంలో నిరంతర అభ్యాసం, వృత్తిపరమైన అభివృద్ధి ప్రాధాన్యాన్ని వివరించారు. ఫ్యాకల్టీకి విలువైన జ్ఞానాన్ని అందించడమే కాకుండా ఆరోగ్య సంరక్షణలో వినూత్న పరిష్కారాలను అన్వేషించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ మాట్లాడుతూ విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య మెరుగైన సహకారానికి ఎఫ్‌డీపీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకించాలి



కూటమి ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ చార్జీలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన బొబ్బిలిలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సామాన్య జనం విలవిల్లాడుతున్నారని, ఈ నేపథ్యంలో విద్యుత్ చార్జీల పెంపు వారికి గుదిబండలా మారనుందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు విరమించుకోవాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. –బొబ్బిలి

పంట పడిపోయే.. పనలు తడిసిపోయే!



ఫెంగల్ తుపాను కారణంగా వీచిన గాలులు, కురిసిన వర్షానికి కొన్నిచోట్ల కోత దశకు వచ్చిన వరి పంట నేలకొరిగింది.

మరికొన్ని చోట్ల కోసిన పంట పనలు తడిసిపోయాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.

ఆరుగాలం కష్టపడి పండించిన పంట సరిగ్గా చేతికి అందివచ్చే సమయంలో పోయిందని వాపోతున్నారు. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం కురిసిన వర్షానికి రాజాం మండలంలోని ఆగూరులో పలుచోట్ల పంట నేలమట్టం కాగా, పెనుబాక పొలాల్లో కోసిన వరి పనలు పూర్తిగా తడిసిపోయాయి. –రాజాం